సాక్షి
అనకాపల్లి

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



అనకాపల్లిలో శారదానది ఒడ్డున ఈద్ ఘాట్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మానవాళికి రంజాన్ సందేశం

జిల్లా అంతటా ఘనంగా వేడుకలు



నక్కపల్లి మండలం బోదిగల్లం దర్గా వద్ద రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తి.. సేవ.. సోదర భావం

సేవ, సోదరభావం వెల్లివిరిసింది. ఆనందోత్సాహాలు పరవళ్లు తొక్కాయి. ముస్లింలు సోమవారం రంజాన్ పండగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆదివారం రాత్రి నెలవంక దర్శనంతో ఉపవాసాలు విరమించారు. సామూహిక ప్రార్థనలు, పేదలకు దానధర్మాలతో పండగను ఘనంగా నిర్వహించారు. అనకాపల్లిలో పెరుగుబజార్ వద్ద జామీద్ మసీదు, శారదాబ్రిడ్జి వద్ద చిన్న మసీదు, ఈద్ ఘాట్‌ల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. చిన్న, పెద్ద భేదం లేకుండా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం పెద్దలు దావూద్ ఆలీ, పీఎస్ హుస్సేన్, ఎండీ జిలానీ మాట్లాడుతూ ఈ పండుగ అనుబంధాలను పెంచుతుందన్నారు. కశింకోటలోని శివారులో ఈద్-గాహ్ వద్ద ముస్లింలు సంప్రదాయ వస్త్రాలు ధరించి సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నూరి మసీదు ఇమాం జియార్ రెహమాన్ అల్లా ప్రవచించిన సూక్తులను చదివి వినిపించారు. నక్కపల్లి మండలం పెద బోదిగల్లం దర్గా వద్ద, మునగపాకలోని ఆల్‌నూర్ మజీద్‌లో ముస్లింలు పెద్ద సంఖ్యలో ప్రార్థనలు చేశారు. నర్సీపట్నం, మాడుగుల, రోలుగుంట, బుచ్చెయ్యపేట తదితర ప్రాంతాల్లో రంజాన్ వేడుకలను ఘనంగా జరిపారు.

– సాక్షి న్యూస్ నెట్‌వర్క్

న్యూస్‌రీల్

నేటి నుంచి ఉదయం, సాయంత్రం ఓపీ సేవలు

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్



మహారాణిపేట: కేజీహెచ్‌లో మంగళవారం నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో కూడా ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. అన్ని సూపర్ స్పెషాలిటీ అవుట్ పేషంట్ (ఓపీ) విభాగాలు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తాయన్నారు. గతంలో సూపర్‌స్పెషాలిటీ ఓపీలు వారానికి మూడు రోజులు పనిచేసేవి. ఇప్పుడు సోమవారం నుంచి శనివారం వరకు అన్ని రోజుల్లో ఓపీలు పనిచేస్తాయని వెల్లడించారు. రోగులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న నలుగురు అరెస్టు

దాబాగార్డెన్స్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న నలుగుర్ని విశాఖ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. సీపీ శంఖబ్రత ఆదేశాలమేరకు సైబర్ క్రైం పోలీసులు విశాఖ కేంద్రంగా జరుగుతున్న బెట్టింగ్ యాప్‌లపై నిఘా పెట్టారు. ఈక్రమంలో బెట్టింగ్ వెబ్‌సైట్‌లో డబ్బు పెట్టేలా అలవాటు చేయిస్తున్న నగరానికి చెందిన జి.ప్రవీణ్‌కుమార్, మదీనావల్లీ, రజియా బేగం, ధరణిని సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. బెట్టింగ్ వెబ్‌సైట్ల రూపకర్తలు దుబాయ్ చెందిన జియా, సౌరభ్‌గా గుర్తించామని పోలీసులు తెలిపారు. విశాఖలో బెట్టింగ్ వెబ్‌సైట్లు ప్రమోట్ చేస్తున్న టెలికాలర్లను విడిచిపెట్టేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. నిందితులను జిల్లా మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www. cybercrime. gov. ఇన్‌లేదా టోల్ ఫ్రీ నంబరు 1930, లేదా కమిషనర్ ఆఫ్ పోలీస్ 7995095799కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

మీ జీతం.. మీ చేతుల్లోనే..

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి హితబోధ

ఉక్కునగరం:

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి తీసుకురావాల్సిన బాధ్యత ఉద్యోగులదేనని, తద్వారా మీ జీతాలు మీరే సమకూర్చుకోవాలని కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ అన్నారు. సోమవారం ఆయన స్టీల్‌ప్లాంట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లోని వివిధ స్థాయి అధికారులు, కార్మికులతో సమావేశమై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్–3ను మొదట్లో జూన్‌లో ప్రారంభించాలని అనుకున్నప్పటికీ, ప్రస్తుతం అది మేలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే సింటర్ ప్లాంట్‌ను ఆధునికీకరించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచనున్నట్లు వెల్లడించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సెయిల్ కంటే మెరుగ్గా ఉందని పేర్కొంటూనే.. సెయిల్‌తో కాకుండా జిందాల్, టాటా స్టీల్ వంటి సంస్థలతో పోటీ పడి ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ రంగంలో కొందరు పని చేస్తుంటే.. మరికొందరు పనిని తప్పించుకునే ప్రయత్నం చేస్తుంటారని, అలాంటి వారిని కూడా ఉత్పత్తి ప్రక్రియలో భాగస్వాములను చేయడంలో మానవ వనరుల విభాగం కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆయన వెంటన స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆత్మస్తుతి.. పరనింద..

- మంత్రి లోకేష్ ప్రసంగమంతా అదే ధోరణి
- కనీసం ఫ్లైఓవర్ సంగతి కూడా ప్రస్తావించని వైనం
- నిర్వాసితులకు కలిసేందుకు విముఖత
- బాధితుల నుంచి తీవ్ర నిరసన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారా లోకేష్

సాక్షి, అనకాపల్లి: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అచ్యుతాపురం పర్యటన సందర్భంగా సాగిన ఆయన ప్రసంగాలు.. తనను తాను పొగుడుకోవడం, ఇతరులను నిందించడంతోనే సాగాయి. నిర్వాసితులను కలవడానికి ఆయనకు తీరిక దొరకలేదు. అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులు, ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. తన ప్రసంగంలో కనీసం ఫ్లైఓవర్ వంతెనను కూడా ఆయన ప్రస్తావించలేదు. అచ్యుతాపురం లేపాక్షి కల్యాణమండపంలో టీడీపీ ఉత్తమ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందు మంత్రి లోకేష్‌కు వినతులు ఇవ్వడానికి అక్కడకు వచ్చిన రోడ్డు విస్తరణ బాధితులు, సెజ్ నిర్వాసిత పునరావాస కాలనీవాసులు, పూడిమడక మత్స్యకారులు, ఏపీఐఐసీ పైప్‌లైన్, బ్రాండిక్స్ పరిహారం బాధితులంతా ఆయన ముఖం చాటేయడంతో అసంతృప్తి వ్యక్తంచేశారు. వినతులు తీసుకుంటామని వీరందరినీ ముందుగా ఒక గదిలో కూర్చుండబెట్టి, రెండు మూడు గంటల పాటు వేచి ఉన్నాక, లోకేష్ వారిని కలవకుండానే వెనుదిరగడంతో నిరసన వ్యక్తమైంది.

సెల్ఫ్ డబ్బాతో బోర్ కొట్టిన ప్రసంగం

మంత్రి నారా లోకేష్ ప్రసంగమంతా సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడంతోనే సరిపోయింది. గతంలో యువగళంలో తనను అవమానించారని, ప్రస్తుతం తనకు కుర్చీలు వేస్తున్న అధికారులే గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో భాగంగా నిర్వహించిన ఒక సమావేశంలో తన చైర్ లాక్కొనిపోయారని చెప్పారు. తనపై, తమ హోంమంత్రిపై కేసులు పెట్టి వేధించారని చెబుతూ.. అసలు ఎందుకు వచ్చారో చెప్పడం మరచిపోయారు. రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో.. ఎన్ని నిధులతో చేపడుతున్నారో.. అది ఎప్పుడు పూర్తవుతుందో కూడా చెప్పకుండా తన ప్రసంగాన్ని ముగించారు. కనీసం నామమాత్రంగానైనా ఫ్లైఓవర్ నిర్మాణం చేపడుతున్నామని ఎక్కడా చెప్పకపోవడంతో సభికులు విసుగు చెందారు.

అక్రమ అరెస్టులు

అచ్యుతాపురం పర్యటనకు వస్తున్న లోకేష్‌కు అడుగడుగునా నిరసన సెగ ఎదురైంది. అచ్యుతాపురం మండలంలో తిమ్మరాజుపేట వద్ద రోడ్డుకు ఇరువైపులా ప్లకార్డులు, బ్యానర్ చూపిస్తూ రోడ్డు విస్తరణ నిర్వాసితులు నిరసన వ్యక్తం చేశారు. నిర్వాసితుల సంఘం నాయకులు కర్రి అప్పారావు, కె.స్వామినాయుడును పోలీసులు అరెస్ట్ చేశారు. అదేవిధంగా రోడ్డు విస్తరణ నిర్వాసితులకు మద్దతు పలుకుతున్న సీపీఎం నేతలను కొంతమందిని ముందస్తుగా అక్రమ అరెస్టులు చేశారు. అచ్యుతాపురం మండలం సీపీఎం కన్వీనర్ రొంగలి రామును అరెస్ట్ చేయడానికి పోలీసులు వెంబడించగా.. అతని కాలుకు తీవ్రగాయం అయింది.

ట్రాఫిక్ ఇబ్బందులు..

అచ్యుతాపురం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మధ్యాహ్నం 12 గంటల నుంచి ట్రాఫిక్ ఆంక్షలు పెట్టడంతో స్థానిక ప్రజలంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ ప్రాంతంలో ఉద్యోగులు, కార్మికులు తమ విధులకు వెళ్లేందుకు పలు ఇబ్బందులు గురయ్యారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి అవమానం

అచ్యుతాపురం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ వంతెన శంకుస్థాపన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు తీవ్ర అవమానం జరిగింది. వేదికపై ఎక్కడో మూలన కూర్చోబెట్టడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చిన్నబుచ్చుకున్నారు. మంత్రి నారా లోకేష్ వేదికపైకి వచ్చిన సమయంలో కూడా చూసీచూడనట్లుగా వెళ్లిపోవడంతో రాష్ట్ర అధ్యక్షుడికి ఇచ్చే గౌరవం ఇదేనా అని తెలుగుదేశం కార్యకర్తలు మండిపడ్డారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే నిధుల మంజూరు

అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు సుమారు 13.5 కి.మీల పొడవైన రోడ్డు విస్తరణ పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే బీజం పడింది. రూ.381 కోట్ల (ఇందులో ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆర్థిక సాయం రూ.243 కోట్లు) నిధులతో నాటి సర్కారు డీపీఆర్ విడుదల చేసింది. టెండర్ పిలవడం కూడా జరిగింది. రోడ్డు విస్తరణకు రైతాంగాన్ని ఒప్పించారు. నిర్మాణం ప్రారంభించేలోపు ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. నాడు తలపెట్టిన అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులకే సోమవారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం డబుల్ రోడ్డుగా ఉన్న ఈ రహదారిని రూ.243 కోట్ల ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆర్థికసాయంతో 4 లైన్ల రహదారిగా విస్తరించనున్నారు. రెండేళ్ల కాలవ్యవధిలో చేపట్టే ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రధానంగా అచ్యుతాపురం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్‌తోపాటు రెండు మైనర్ బ్రిడ్జిలు, 47 కల్వర్టులు నిర్మిస్తారు. ఈ రహదారి హరిపాలెం రోడ్డు, పూడిమడక రోడ్డు వెంబడి నివాసాలు, పారిశ్రామిక సంస్థలు, మత్స్యకార గ్రామాలకు ప్రధాన కనెక్టివిటీని అందిస్తుంది. ఏపీ సెజ్‌లో ఉన్న సుమారు 180 పరిశ్రమల నుంచి జిల్లా కేంద్రమైన అనకాపల్లికి రాకపోకలు సాగించడం సులభతరం కానుంది. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు 20 గ్రామాల మీదుగా ఈ రోడ్డు సాగుతుంది. వీటిలో 10 గ్రామాలకు రోడ్డు విస్తరణ ఉంటుంది.

స్పీకర్‌కు నో మైక్

స్పీకర్ సొంత జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేష్ అచ్యుతాపురంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4 గంటల వరకు టీడీపీ ఉత్తమ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు కనిపించలేదు. సాయంత్రం అచ్యుతాపురం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో కూడా స్పీకర్ అయ్యన్నపాత్రుడికి మాట్లాడేందుకు అవకాశం కల్పించలేదు. సమావేశానికి హాజరైన టీడీపీ కార్యకర్తలు, నాయకులు అయ్యన్న మాట్లాడతారని ఎదురుచూశారు. కానీ స్పీకర్ ప్రసంగం తనను డామినేట్ చేస్తుందేమోనని అయ్యన్నకు మైక్ ఇవ్వలేదని అక్కడ కార్యకర్తలు, నాయకులు చర్చించుకున్నారు.

నిర్వాసితుల నుంచి నిరసన సెగ



తిమ్మరాజుపేటలో మంత్రి లోకేష్ పర్యటనలో నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

- అచ్యుతాపురం పర్యటనలో ప్లకార్డులు, బ్యానర్‌తో నిరసన
- పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలని నినాదాలు

మునగపాక : మంత్రి లోకేష్‌కు నిరసన సెగ తగిలింది. అచ్యుతాపురం జంక్షన్‌లో సోమవారం ఫ్లైఓవర్ శంకుస్థాపనకు వచ్చిన మంత్రి లోకేష్‌కు అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట జంక్షన్ వద్ద వామపక్ష నేతలతో కలిసి పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులు నిరసన తెలిపారు. ప్లకార్డులు, బ్యానర్ పట్టుకొని తమకు న్యాయం చేయాలంటూ నినదించారు. ఈ సందర్భంగా వామపక్ష నేతలు కర్రి అప్పారావు, ఎస్.బ్రహ్మాజీ, రొంగలి రాము తదితరులు మాట్లాడుతూ పూడిమడక రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహారాన్ని టీడీఆర్ బాండ్ల రూపంలో కాకుండా నేరుగా అకౌంట్‌లో నగదు జమ అయ్యేలా చూడాలన్నారు. గతంలో గ్రామసభలు నిర్వహించి బాధితులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాల్సి ఉన్నా అభివృద్ధికి ఆటంకం కలగకూడదన్న లక్ష్యంతో తామంతా అధికారులు చెప్పినట్టు అంగీకరిస్తే నేడు టీడీఆర్ బాండ్లు ఇస్తామంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రహదారి విస్తరణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు.

విస్తరణ ద్వారా సమస్య పరిష్కారమవుతుందన్నారు. అయితే ప్రభుత్వం పరిహారం విషయంలో నిర్వాసితులకు అన్యాయం జరిగేలా టీడీఆర్ బాండ్లను తెరమీదకు తీసుకురావడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

స్కేటింగ్‌లో కార్తీక శరణ్య సత్తా

ఎంవీపీకాలనీ/తగరపువలస:

తైవాన్ వేదికగా జరిగిన అంతర్జాతీయ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భీమిలి మండలం మూలకుద్దుకు చెందిన బొల్లెంకుల కార్తీక శరణ్య సత్తాచాటింది. గత నెల 25 నుంచి 30 మధ్య తైవాన్‌లో ఈ పోటీలు జరగ్గా.. రెండు విభాగాల్లో రజత పతకాలు సాధించింది. ఆమె ఎంవీపీకాలనీలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో 8వ తరగతి చదువుతోంది. విశాఖ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. కొన్నేళ్లుగా స్కేటింగ్ అసోసియేషన్ కోచ్ సత్యనారాయణ వద్ద శరణ్య శిక్షణ పొందుతోంది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు రత్నకుమారి, అప్పన్న రెడ్డి, కోచ్ చిట్టిబాబు, స్కూల్ యాజమాన్యంతో పాటు స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఆమెకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



జాతీయ పతాకంతో కార్తీక శరణ్య

అలా భోగాపురానికి..

- భోగాపురం విమానాశ్రయం కనెక్టివిటీకి 15 రహదారుల అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.392 కోట్లతో రోడ్ల నిర్మాణాలకు ప్రణాళికలు
- వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యం
- నిర్మాణాలకు సిద్ధమవుతున్న ఆర్‌అండ్‌బీ, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ

నాటి అడుగులే.. నేడు రహదారులు..



విశాఖ సిటీ : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో చేసిన ప్రణాళికలే నేడు బాటలుగా మారుతున్నాయి. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు కనెక్టివిటీకి 15 కొత్త రహదారుల నిర్మాణాలకు అడుగులు పడుతున్నాయి. విశాఖ నుంచి అంతర్జాతీయ విమానాశ్రయానికి సునాయాసంగా, వేగంగా రాకపోకలు సాగించేందుకు కొత్త రోడ్లు సిద్ధం కానున్నాయి. ఇందుకోసం వీఎంఆర్‌డీఏ అంచనాలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. వచ్చే నెలలో టెండర్లు పిలిచి మే నుంచి రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి వీటిని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రూ.392 కోట్ల అంచనా వ్యయంతో 82.08 కిలోమీటర్ల మేరకు విస్తరణ, కొత్త రోడ్లను అభివృద్ధి చేయనున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రణాళికలు

విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయానికి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు జాతీయ రహదారికి అనుసంధానంగా 15 ప్రత్యామ్నాయ రోడ్లను అభివృద్ధి చేయాలని గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. వీటిని మాస్టర్ ప్లాన్‌లో కూడా చేర్చింది. వీటిలో ఇప్పటికే ఒక రోడ్డు పూర్తి కాగా.. మిగిలిన 14 రహదారుల నిర్మాణానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటి నిర్మాణాలను వీఎంఆర్‌డీఏతో పాటు జీవీఎంసీ, ఆర్‌అండ్‌బీ శాఖలు చేపట్టనున్నాయి. అయితే అత్యధికంగా 8 రహదారుల నిర్మాణ బాధ్యతను వీఎంఆర్‌డీఏ తీసుకుంటోంది. ఆర్‌అండ్‌బీ 3, జీవీఎంసీ 2 రోడ్లను నిర్మించనున్నాయి. మిగిలిన నాలుగు రహదారులను కూడా జీవీఎంసీ, ఆర్‌అండ్ బీలతో కలిపి వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేయనుంది.

రహదారి	నిర్మాణ శాఖ	కి.మీ.
అయినాడ జంక్షన్–ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్	ఆర్‌అండ్‌బీ	6.5
దాకమర్రి–రావాడ	వీఎంఆర్‌డీఏ	6.66
చిప్పాడ–పోలిపల్లి(దివీస్‌రోడ్డు)	వీఎంఆర్‌డీఏ	6.32
తగరపువలస–మూలకుద్దు	జీవీఎంసీ	3.6
నేరేళ్లవలస–తాళ్లవలస	వీఎంఆర్‌డీఏ	4
దొరతోట జంక్షన్–కుమ్మరిపాలెం	ఆర్‌అండ్‌బీ	6.2
బోయపాలెం–మంగమారిపేట	వీఎంఆర్‌డీఏ	6
గంభీరం–గంభీరం ఎన్‌హెచ్16	వీఎంఆర్‌డీఏ	2.2
పరదేశిపాలెం–గంభీరం	వీఎంఆర్‌డీఏ	1.4
మారికవలస–తిమ్మాపురం	జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ	6.3
శివశక్తినగర్–హరిత ప్రాజెక్ట్స్	జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ	1.7
అడవివరం–గండిగుండం	ఆర్‌అండ్‌బీ, వీఎంఆర్‌డీఏ	8
గండిగుండం–చింతలపాలెం	వీఎంఆర్‌డీఏ	9.9
వేపగుంట–జుత్తాడ	జీవీఎంసీ	6.05
పినగాడి–వేపగుంట	ఆర్ అండ్ బీ	7.25

8 విస్తరణ.. 15 కొత్త రోడ్లు

ఈ 15 రహదారులలో 8 రోడ్లను విస్తరించనున్నారు. మిగిలిన ఏడు రోడ్లను కొత్తగా అభివృద్ధి చేయనున్నారు. విజయనగరం జిల్లా అయినాడ జంక్షన్ నుంచి రింగ్‌రోడ్–ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ మధ్య 9 మీటర్ల రోడ్డు ఉండగా.. దాన్ని 24 మీటర్లకు విస్తరించనున్నారు. తగరపువలస (చిట్టివలస రోడ్డు) నుంచి మూలకుద్దు మధ్య ఉన్న రోడ్డును 45 మీటర్లకు, దొరతోట రోడ్డు జంక్షన్ నుంచి కుమ్మరిపాలెం మధ్య 60 మీటర్లకు, బోయపాలెం జంక్షన్ నుంచి మంగమారిపేట జంక్షన్, శివశక్తి నగర్ నుంచి హరిత ప్రాజెక్ట్స్, అడవివరం నుంచి గండిగుండం, పినగాడి నుంచి వేపగుంట రోడ్లను విస్తరించనున్నారు. అలాగే దాకమర్రి–రావాడ, చిప్పాడ–పోలిపల్లి (దివీస్ రోడ్డు), నేరెళ్లవలస–తాళ్లవలస, గంభీరం–గంభీరం హైవే, పరదేశిపాలెం–గంభీరం, వేపగుంట–జుత్తాడల మధ్య కొత్త రహదారులను అభివృద్ధి చేయనున్నారు.

వచ్చే ఏడాది జూన్‌కు పూర్తి



భోగాపురం విమానాశ్రయం పనులు పూర్తయ్యేలోగా ఈ రహదారులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విశాఖ నుంచి ఎయిర్‌పోర్టుకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా సునాయాశంగా రాకపోకలు సాగించడానికి అనువుగా ప్రత్యామ్నాయ రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. ఇందుకు సంబంధించి వచ్చే నెలలోనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి మేలో నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది జూన్ నాటికి ఈ రోడ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించాం.

– కె.ఎస్.విశ్వనాథన్, మెట్రోపాలిటన్ కమిషనర్

ఉష్ణోగ్రతలు

అనకాపల్లి		
గరిష్ఠం	:	34.5 డిగ్రీలు
కనిష్ఠం	:	23.2 డిగ్రీలు
చోడవరం		
గరిష్ఠం	:	38.5 డిగ్రీలు
కనిష్ఠం	:	29.0 డిగ్రీలు

అప్పన్న చందనోత్సవం ఏర్పాట్లపై సమీక్ష



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఈవో సుబ్బారావు, సీఎఫ్‌వో భ్రమరాంబ

సింహాచలం: ఈ నెల 30న జరిగే సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారి నిజరూప దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని దేవదాయశాఖ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ డి.భ్రమరాంబ దేవస్థానం అధికారులను ఆదేశించారు. చందనోత్సవం ఏర్పాట్లపై సోమవారం ఆమె దేవస్థానం ఈవో కె.సుబ్బారావు, విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. వీలైనంత వరకు ఎక్కువ మందికి దర్శనం కల్పించే లక్ష్యంతో అధికారులంతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉత్సవ నిర్వహణ అంతా సీసీ కెమెరాల నీడలో జరగాలని, ప్రతీ ప్రదేశం వద్ద శీతల పానీయాలు అందించాలని సూచించారు.

క్లుప్తంగా

మంత్రి లోకేష్ పర్యటనలో దొంగల చేతివాటం

మునగపాక : మంత్రి లోకేష్ పర్యటనలో ఇదే అదనుగా భావించి దొంగలు చేతివాటం ప్రదర్శించారు. దీంతో కొంతమంది జేబులు చిల్లులయ్యాయి. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు రహదారి విస్తరణకు సంబంధించి మంత్రి లోకేష్ చేతులమీదుగా సోమవారం మధ్యాహ్నం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు మార్గాన వచ్చిన లోకేష్‌కు స్వాగతం పలికేందుకు పలువురు కూటమి నేతలు అనకాపల్లి బైపాస్ రోడ్డుకు చేరుకున్నారు. ఇదే అదనుగా దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. మునగపాకకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ బద్దెం సూర్యనారాయణకు చెందిన పర్సును గుర్తు తెలియని వ్యక్తి దొంగలించాడు. ఈ పర్సులో అరతులం బంగారం రింగ్ అలాగే 15వేల రూపాయల నగదు ఉన్నట్టు బాధితుడు సూర్యనారాయణ తెలిపారు. అలాగే మరికొంత మంది జేబులు కూడా చిల్లయినట్లు తెలిసింది.

మళ్ల సతీష్‌కు ఐఐఎం ఇండోర్ అకడమిక్ ఎక్సలెన్సీ అవార్డు



ఐఐఎమ్ ఇండోర్ పాలక మండలి చైర్మన్ మురుగన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సతీష్

అనకాపల్లి టౌన్: భారత ప్రభుత్వ సంస్థ ఐఐఎం ఇండోర్‌లో అకడమిక్ ఎక్సలెన్సీ అవార్డును పట్టణానికి చెందిన మళ్ల శ్రీకర్ సతీష్ సాధించారు. సతీష్ 2022లో క్యాట్ ద్వారా ఎంపికై ఎంబీఏ పూర్తి చేసుకొని పట్టా పొందారు. ఇటీవల జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి చెస్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ సమక్షంలో ఐఐఎం ఇండోర్ పాలక మండలి చైర్మన్ మురుగన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

ట్రాక్టర్ మెకానిక్ షెడ్‌లో చోరీ



దొంగతనం జరిగిన స్థలం

రావికమతం : మండలంలో గర్నికం సినిమా హాలు ఎదురుగా బి.ఎస్.రోడ్డును ఆనుకోని ఉన్న ట్రాక్టర్ మెకానిక్ షెడ్‌లో ఉంచిన ఇంజిన్ వెనుక భాగంలో ఉన్న విడి భాగాలను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ మేరకు షాప్ యాజమాని రామచంద్రరావు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

నర్సుల పోస్టులకు 'నకిలీ' పత్రాలు

- కరోనా సమయంలో పనిచేసినట్లు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన అభ్యర్థులు
- అదనంగా 15 మార్కుల కోసం అడ్డదారులు
- ఉన్నతాధికారుల తనిఖీల్లో బండారం బట్టబయలు





విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

మహారాణిపేట (విశాఖ) : నర్సుల పోస్టుల భర్తీ ప్రక్రియలో నకిలీ సర్టిఫికెట్లు వెలుగులోకి వచ్చాయి. కొందరు నర్సింగ్ అభ్యర్థులు అదనంగా 15 మార్కులు పొందడానికి కరోనా సమయంలో పనిచేసినట్లుగా నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారు. అలాగే.. ప్రభుత్వ ఆసుపత్రులు లేదా కళాశాలల్లో పనిచేస్తున్న నర్సులు కూడా తిరిగి ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రాథమిక జాబితాపై వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం ఉన్నతాధికారుల తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. దీంతో సంబంధిత అభ్యర్థుల దరఖాస్తులను అధికారులు పక్కన పెట్టారు. దీని కారణంగా నర్సింగ్ అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల ఆలస్యమవుతోందని అధికారులు తెలిపారు.

ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొదట 106 నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. తర్వాత మరో 264 పోస్టులు అదనంగా చేరడంతో మొత్తం 370 పోస్టుల భర్తీ చేపట్టారు. ఈ పోస్టుల కోసం గతంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 8,300 దరఖాస్తులు వచ్చాయి. జనవరి 27న ప్రాథమిక జాబితా విడుదల చేయగా, దానిపై 1,570 అభ్యంతరాలు వచ్చాయి. ఈ అభ్యంతరాలను పరిశీలించిన అధికారులు..నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన వారు, ఇప్పటికే ఉద్యోగం చేస్తున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకున్నట్లు గుర్తించారు. కరోనా సమయంలో పని చేసిన వారికి 15 అదనపు మార్కులు ఇస్తుండటంతో చాలా మంది నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు తేలింది. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ రాధారాణి ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు.. వివిధ ప్రోగ్రామ్‌ల కింద పనిచేసిన వారి దరఖాస్తులను తిరస్కరించారు. సరైన వివరాలు సమర్పించని వారి దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకోవడం లేదు. కాగా.. మరో మూడు రోజుల్లో నర్సుల పోస్టులకు సంబంధించిన తుది జాబితాను విడుదల చేస్తామని డాక్టర్ రాధారాణి సోమవారం 'సాక్షి'కి తెలిపారు. ఈ జాబితాపై కూడా అభ్యంతరాలు స్వీకరించి, అనంతరం రోస్టర్ ప్రకారం ఎంపిక జాబితాను ప్రకటిస్తామని ఆమె వివరించారు.

సుర్రుమన్న సూరీడు....

- చోడవరంలో 38.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



ఎండవేడిమికి బాటసారుల అవస్థలు

చోడవరం : రెండ్రోజులుగా సూరీడు సుర్రుమనిపిస్తున్నాడు. సోమవారం చోడవరంలో 38.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. ఎండ తీవ్రతతోపాటు వడగాడ్పులు వీయడంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఉదయం 8గంటల నుంచే ఎండ ప్రారంభమైంది. 9గంటల నుంచి 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైన ఉష్ణోగ్రత పెరుగుతూ మధ్యాహ్నం ఒంటిగంట 38.5డిగ్రీల సెల్సియస్‌కు చేరింది. మోటారు సైకిలిస్టు, బాటసారులు, ఆటోవాలాలు ఎవరూ బయటకు రాలేకపోయారు. తప్పనిసరి బయటకు వచ్చిన వారు తలకు, ముఖానికి రక్షణ కవచాలు ధరించారు. తరుచూ విద్యుత్ కోతలు కూడా ఉండడంతో ఉక్కపోతతో చిన్నాపెద్దా, వృద్ధులు సతమతమయ్యారు. ఎండ తీవ్రత బాగా పెరిగినందున అత్యవసరమైతే తప్ప ఎవరూ బయట తిరగవద్దని వైద్యులు చెబుతున్నారు. మరో పక్క చల్లటి పానీయాల దుకాణాలు రద్దీగా మారాయి.

భారత వ్యవసాయ ఇంజనీర్ల సమాఖ్య డైరెక్టర్‌గా వెంగయ్య



డాక్టర్ వెంగయ్య

రంపచోడవరం: భారత వ్యవసాయ ఇంజనీర్ల సమాఖ్య డైరెక్టర్‌గా 2025–26 సంవత్సరానికి పందిరిమామిడి వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి.సి. వెంగయ్య ఎన్నికయ్యారు. జూమ్ ద్వారా జరిగిన సమావేశంలో సోమవారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత వ్యవసాయ ఇంజనీర్ల సమాఖ్య (ఐఎస్ఏఈ) ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తోందన్నారు. అన్ని రాష్ట్రాల్లో చాప్టర్స్ ఉన్నట్టు చెప్పారు. ప్రస్తుతం ప్రతి రాష్ట్రంలో వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయంలో అధునాతన యంత్రాలు, సాంకేతికత కోసం కృషి చేస్తున్నట్టు చెప్పారు. దక్షిణ భారత దేశం నుంచి ఎన్నికైన ఏకైక శాస్త్రవేత్తగా డాక్టర్ వెంగయ్య గుర్తింపు పొందడం విశేషం.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

- సీపీఎం జిల్లా జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

అనకాపల్లి : అచ్యుతాపురం నిర్వాసితులకు న్యాయం చేయాలని అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటలో శాంతియుతంగా మానవహారం చేస్తున్న నిర్వాసిత నాయకులు కర్రి అప్పారావు, కె.సోమునాయుడులను, ఆర్.రామును గృహ నిర్బంధం చేయడం అన్యాయమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అచ్యుతాపురం రోడ్డు శంకుస్థాపనకు వస్తున్న కారణంగా రెండు రోజుల ముందు నుంచి సీపీఎం నాయకులు, నిర్వాసితుల నాయకుల ఇళ్లకు వెళ్లి గృహనిర్బంధం చేయడం, ఫోన్లు చేసి బెదిరించడం, ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామిక చర్యలని, ప్రజల తరపున పోరాడుతున్న నాయకులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా నారా లోకేష్ రోడ్డుకు శంకుస్థాపన చేయడం పేద ప్రజలకు తీవ్ర ద్రోహం చేయడమేనని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణానికి పేదల భూములు, ఇళ్ల తీసుకొని ఎస్ఈజెడ్ కంపెనీల లాభాల కోసమే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్‌ప్రభుత్వం అడ్డగోలుగా చేస్తున్న భూ సేకరణలను నిలుపుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. అనకాపల్లి– అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ చెల్లించి, టీడీఆర్ బాండ్లు స్థానంలో నగదు రూపంలో పరిహారం ఇవ్వాలని, ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ ప్రకారం భూములు, ఇళ్లు, షాపులు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలని కోరారు. రోడ్డు విస్తరణ కారణంగా ఉపాధి కోల్పోతున్న వారికి ఉపాధి, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆదివాసుల భూములపై కిరాయి మూకల దాడి

- పంటల ధ్వంసం
- కేసు నమోదు చేసిన పోలీసులు



చటర్జీపురంలో కోర్టు వివాదంలో ఉన్న భూమిలో ధ్వంసమైన పంట

రోలుగుంట : ఆదివాసుల భూములపై పొరుగుజిల్లాకు చెందిన కిరాయి మూకలు దాడి చేసి పంటలు ధ్వంసం చేసిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలివి. ఎం.కె.పట్నం రెవిన్యూ సర్వే నెంబరు 139 లో పది ఎకరాలు మెట్టు భూమి దశాబ్దాలుగా చటర్జీపురం ఆదివాసీల సాగులో ఉంది. వారి సాగును రికార్డులో కూడా నమోదు చేశారు. అయితే ఆ భూమిపై కన్ను పడిన స్థానికేతరుడు తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన మల్లిడి రామిరెడ్డి అనే వ్యక్తి 2021లో ఈ భూములను కొనుగోలు చేశామని ఆదివాసీలను అక్కడి నుంచి తొలగించడానికి ప్రయత్నం చేశాడు. దీనికి వారా నూకరాజు అనే వ్యక్తి మద్దతు ఇస్తున్నారు. దీంతో ఆదివాసీలు నర్సీపట్నం సివిల్ కోర్టులో మల్లిడి రామిరెడ్డి, వారా నూకరాజుపై కేసు దాఖలు చేశారు. ఈ కేసుల్లో రామిరెడ్డి గైర్హాజరు కాగా నూకరాజు కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా 2023 జనవరిలో ఈ భూమిని తన పేరుతోను, ఐటీడీఏ పాడేరు పరిధిలో టీచర్‌గా పని చేస్తున్న తన కుమారుడు కన్నబాబు పేర్లతో రామిరెడ్డి నుంచి నూకరాజు కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి వారు చటర్జీపురం ఆదివాసీలపై బెదిరింపులకు పాల్పడుతూ దాడులు చేస్తూ వస్తున్నారు. 2023 సెప్టెంబర్‌లో వారా నూకరాజు, టీచర్ కన్నబాబు 70 మంది కిరాయిమూకలతో ఆదివాసీలపై దాడి చేశారు. వారు పెంచుతున్న అరటి, జామచెట్లను ధ్వంసం చేశారు. దీంతో వీరిద్దరిపైనా రోలుగుంట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరు వర్గాలతో పొలం జోలికి వెళ్లబోమని, పంటలను అలానే ఉంచాలని చెప్పి పోలీసులు సంతకాలు చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో నూకరాజు మళ్లీ సోమవారం 4 ఆటోలు, 50 మందితో వెళ్లి ఆ భూమిలో పంటలను ధ్వంసం చేశారు. ఈ చర్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నూకరాజును అరెస్ట్ చేయాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ డిమాండు చేసింది. దీంతో ఎస్ఐ రామకృష్ణారావు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ పంట ధ్వంసం కారకుడిని అదుపులోకి తీసుకుని, దాడిలో పాల్గొన్నవారిపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వారి వాహనాలను కూడా స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు.

ఖైదీల సౌకర్యాలపై ఆరా



ఖైదీలతో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి రాగిధర్..

ఆరిలోవ: కేంద్ర కారాగారాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సోమవారం సందర్శించారు. జైలు అధికారులతో కలిసి లోపల ఖైదీల బ్యారక్‌లు, పరిసరాలు, పరిశుభ్రత తదితరాలను పరిశీలించారు. జైలు ఆస్పత్రి, జ్ఞాన సాగర్ గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఖైదీల సంఖ్య, వారికి అందుతున్న సౌకర్యాలు, భోజనం, వైద్యం తదితరాల గురించి జైలు సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారు ఏయే నేరాలు, కేసులపై వచ్చా రో అడిగి తెలుసుకున్నారు. మంచి ప్రవర్తన కలిగి ఉండాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు ఉప పర్యవేక్షణాధికారులు జవహర్‌బాబు, సాయిప్రవీణ్, జైలర్లు, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెలలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు

- లోగో ఆవిష్కరించిన నేతలు



ఏఐవైఎఫ్ జాతీయ 17వ మహాసభల లోగో ఆవిష్కరణ

అనకాపల్లి : రాష్ట్ర ప్రజలను మోసం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిట్ట అని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మహాసభల లోగోను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐవైఎఫ్ జాతీయ 17వ మహాసభలు మే 15 నుంచి 18వ తేదీ వరకూ తిరుపతిలో జరుగుతాయని తెలిపారు. దేశంలో చదువుకున్న చదువుకి ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగ యువత పెరుగుతుందని, ఏమీ పట్టనట్టు పాలకులు వ్యవహరిస్తున్నారని అన్నారు. కులగణన పేరుతో మతాల మధ్య గొడవలు సృష్టించి నేటి పాలకులు పబ్బం గడుపుకుంటున్నారని చెప్పారు. దేశ ప్రజల్లో విద్వేషాలను నింపుతూ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రశ్నించకుండా వారి దృష్టిని మళ్లించి మరో వైపు దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ జిల్లా నాయకుడు రాజాన దొరబాబు, జిల్లా కార్యదర్శి వియ్యపురాజు, అధ్యక్షుడు వేమల కన్నబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు డొక్కరి హరీష్, సభ్యులు బొందు బాబ్జి, పెంటకోట, సంతోష్, విత్తనాల పోతురాజు, సాయి పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ అనుమానాస్పద మృతి



కండక్టర్ వెంకట రమణ (ఫైల్)

సబ్బవరం: టిక్కలిపాలెం గ్రామం సమీపంలోని రైవాడ కాలువలో వాల్తేరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ గిడితూరి వెంకటరమణ (54) ఆదివారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కైలాసపురం కస్తూరినగర్‌లో నివాసం ఉంటున్న వెంకటరమణ స్వగ్రామం టిక్కలిపాలెం. అతని తండ్రి ముత్యాలు డీఎల్‌బీలో ఉద్యోగం చేయడంతో కైలాసపురంలో స్థిరపడ్డారు. అయితే స్వగ్రామం టిక్కలిపాలెంలో భూమి కొనాలని వెంకటరమణ భావించి, బంధువులతో మాట్లాడారు. ఈ మేరకు తన స్నేహితుడు వాసుపల్లి ఎల్లాజీతో కలిసి ఆదివారం ఉదయం రూ.20 వేలు తీసుకుని టిక్కలిపాలెం వచ్చారు. భూమి కొనుగోలు విషయంలో ఇరువర్గాల మధ్య బేరం కుదరకపోవడంతో మధ్యాహ్నం అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారు. అయితే సాయంత్రం 6 గంటల సమయంలో వెంకటరమణ రైవాడ కాలువలో స్నానానికి వెళ్లి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. పోలీసులకు కూడా సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి పెద్ద కుమారుడు లీలా వంశీనాథ్ సోమవారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

సీలేరులో మొసలి హల్‌చల్



సీలేరు జెన్‌కో వద్ద మొసలి

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు గుంటవాడ రిజర్వాయర్ ఒడ్డున గత వారం రోజులుగా మొసలి హల్‌చల్ చేస్తోంది. నీటిలో ఉండాల్సిన మొసలి ఒడ్డుకు వచ్చి రోడ్డుకు ఇరు వైపులా తిరుగుతుండడంతో ఆ దారిలో వెళ్లే వారు, ఉద్యోగులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి 10గంటల సమయంలో రిజర్వాయర్ ఒడ్డున తిరుగుతూ సుమారు 12 అడుగుల పొడవున్న మొసలి కొందరి కంటపడింది. రిజర్వాయర్ ఒడ్డుకు మొసలి రావడంతో అక్కడి ఉద్యోగులు జెన్‌కో ఏఈఈ సురేష్ విజిలెన్స్ ఉద్యోగి కోటేశ్వరరావుకు తెలియజేశారు. వెంటనే వారు సంబంధిత సిబ్బంది వెళ్లి దానిని సురక్షితంగా రిజర్వాయర్‌లోకి పంపించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఒడిశా భూభాగంలో ఉన్న ఈ ప్రాంతంలో ఎనిమిది నెలల కిందట ఓ మొసలి రిజర్వాయర్ నుంచి బయటకు వచ్చి మృతి చెందింది. దాన్ని చిత్రకొండ అటవీశాఖ అధికారులు అప్పట్లో ఖననం చేశారు.

180 కిలోల గంజాయి పట్టివేత

పెందుర్తి: ఒడిశా నుంచి నాసిక్‌కు తరలిస్తున్న గంజాయిని టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సీఐ కె.వి సతీష్‌కుమార్ తెలిపిన వివరాలివి. మినీ వ్యాన్‌లో 180 కిలోల గంజాయిని ఒడిశా నుంచి అరకు మీదుగా నగరం వైపు తరలిస్తున్న సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు పెందుర్తి మండలం రాజయ్యపేట సమీపంలో కాపు కాశారు. మినీ వ్యాన్‌ను అడ్డుకుని అందులో పరిశీలించగా గంజాయి పట్టుబడింది. గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మినీ వ్యాన్‌తో పాటు రెండు బైక్‌లు, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

రైల్వే స్టేషన్ వద్ద..

ఒడిశా రాష్ట్రం పడువా గ్రామం నుంచి నగరానికి గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు పెందుర్తి రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నారు. కేరళ కొట్టాయంకు చెందిన ఎస్.పి షరీఫ్ అలియాస్ అదుర్ ఒడిశా నుంచి నాలుగున్నర కిలోల గంజాయిని బ్యాగ్‌లో పట్టుకుని నగరానికి వస్తున్నాడు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న పోలీసులు రైల్వే స్టేషన్ వద్ద కాపు కాసి అతడ్ని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

పట్టువదలని అక్రమార్కుడు

- ప్రభుత్వ భూమి కబ్జాకు పదే పదే యత్నం
- తాజాగా స్థలం చదును చేస్తుండగా అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ స్థలాన్ని ప్రొక్లెయిన్ చదును చేస్తున్న దృశ్యం

కొమ్మాది: రూ.4 కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలంపై కన్నేసిన భూ కబ్జాదారుడు మరోసారి బరితెగించాడు. జీవీఎంసీ 4వ వార్డు పరిధి పరదేశిపాలెంలోని కాపులుప్పాడ రెవెన్యూ సర్వే నంబర్ 64లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. రంజాన్ సెలవును అదునుగా భావించి.. సోమవారం తెల్లవారుజామునే ప్రొక్లెయిన్‌ను ఉపయోగించి దాదాపు 60 సెంట్ల స్థలాన్ని చదును చేశాడు. తన వద్ద ఈ స్థలానికి సంబంధించిన పత్రాలు ఉన్నాయని.. నకిలీ పత్రాలు చూపిస్తూ నమ్మబలికే ప్రయత్నం చేశాడు. అయితే స్థానికులు వెంటనే స్పందించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పనులు నిలిపివేయాలని ఆదేశించారు. తొలుత పనులు నిలిపివేసినప్పటికీ.. మధ్యాహ్నం తిరిగి పది మంది కూలీలతో మళ్లీ పనులు ప్రారంభించాడు. దీంతో అధికారులు ప్రొక్లెయిన్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించడంతో పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఇదే వ్యక్తి గతంలో కూడా ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. 2015లో అతని ప్రయత్నాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఆ తర్వాత 2021లో ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించగా, అప్పట్లో అధికారులు దానిని తొలగించారు. ఇప్పుడు మళ్లీ అదే స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడం గమనార్హం. దీంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం

పరదేశిపాలెంలో ఆక్రమణపై సమాచారం అందింది. తక్షణమే అధికారులు స్పందించి పనులు నిలిపివేశారు. ప్రభుత్వ స్థల పరిరక్షణలో భాగంగా తక్షణమే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం. ఈ స్థలాన్ని పదే పదే ఆక్రమిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటాం.

– సంగీత్ మాథూర్, ఆర్డీవో, భీమిలి

నాలుగో లైన్‌కి మోక్షం

- కొత్తవలస–విజయనగరం మధ్య కొత్త రైల్వే లైన్
- రూ.239.91 కోట్లతో టెండర్లు ఆహ్వానించిన ఈస్ట్ కోస్ట్ రైల్వే
- రెండేళ్లలో పూర్తి చేసేలా నిబంధనలు
- లైన్ పూర్తయితే సరకు రవాణా మరింత వేగవంతం



సాక్షి, విశాఖపట్నం: ఐదేళ్ల క్రితం నాటి ప్రతిపాదనలు ఎట్టకేలకు పట్టాలెక్కుతున్నాయి. తూర్పు కోస్తా రైల్వే ప్రాజెక్టులపై సీతకన్ను వేసిన రైల్వే బోర్డు.. జోన్‌కు శంకుస్థాపన చేసిన తర్వాత కీలక ప్రాజెక్టులపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా సరకు రవాణాతో పాటు.. రైల్వే ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేలా కొత్తవలస–విజయనగరం నాలుగో రైల్వే లైన్‌కు మోక్షం కలిసింది. ఈ లైన్ నిర్మాణానికి రూ.239 కోట్లతో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ టెండర్లు ఆహ్వానించింది. టెండర్లు ఖరారు చేసిన తర్వాత... రెండేళ్లలో పనులు పూర్తి కానున్నాయి. వాల్తేరు పరిధిలో ఉన్న కొత్తవలస, విజయనగరం మధ్య నాలుగో రైల్వే లైన్ని నిర్మించాలని అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపించారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ని కూడా సిద్ధం చేసి నాలుగేళ్ల క్రితం పంపించగా.. దానికి ఆమోదముద్రవేశారు. కాని.. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రాథమికంగా నిధులు మంజూరుకు పరిపాలన పరమైన అనుమతులు కూడా మంజూరయ్యాయి. కానీ.. టెండర్లు పిలవడంలో మాత్రం ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అయితే విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించి.. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేసిన తర్వాత.. ఒక్కో ప్రాజెక్టుపై రైల్వే బోర్డు అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే కొత్తవలస–విజయనగరం మధ్య నాలుగో రైల్వే లైన్‌కు తాజాగా టెండర్లు ఆహ్వానించారు.

రూ.239 కోట్లతో నిర్మాణానికి..

కొత్తవలస విజయనగరం మధ్య రైల్వేలైన్‌లు కీలకంగా మారాయి. విశాఖపై వచ్చే రద్దీని నియంత్రించేందుకు కొత్తవలస జంక్షన్ ప్రధాన భూమిక పోషిస్తోంది. ఇందుకనుగుణంగా.. విజయనగరం, కొత్త వలస జంక్షన్ మధ్య ఫోర్త్‌లైన్ అవశ్యమని గుర్తించారు. టూ పాకెట్ సిస్టమ్‌తో టెండర్లు ఆహ్వానించారు. దాదాపు 35 కిలోమీటర్ల మేర ఈ లైన్ రాబోతోంది. మొత్తం రూ.239.91 కోట్లతో టెండర్లు పిలిచారు. ఏప్రిల్ 25 వ తేదీ వరకూ టెండర్లు వేసేందుకు గడువు విధించారు. మొత్తం 4 షెడ్యూల్స్‌లో పనులు నిర్వహించనున్నారు. వర్క్ ఆర్డర్ ఖరారు చేసిన తర్వాత... 24 నెలల్లో పనులు పూర్తి చెయ్యాలని నిబంధన విధించారు. ఈ లైన్ పూర్తి చేస్తే వైజాగ్‌రైల్వే స్టేషన్‌కు రైళ్ల రద్దీ నిర్వహణ సులభతరమవుతుంది. అదేవిధంగా.. వైజాగ్ పోర్టుతో పాటు స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రధాన పరిశ్రమలకు సరకు రవాణా మరింత సులభతరమవుతుంది. పాసింజర్ రైళ్లపై ప్రభావం పడకుండా.. గూడ్స్ రైళ్లకు మార్గం సుగమమవుతుందని వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

నూకాంబికకు కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న వ్యవస్థాపక ధర్మకర్త శివ గణేష్

కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మవారిని సోమవారం కూడా ఎక్కువ మంది భక్తులు దర్శించుకున్నారు. కొత్త అమావాస్య ఉత్సవాల రద్దీ దృష్ట్యా నిరీక్షించాల్సి వస్తోందని ఆయా రోజుల్లో రాకుండా ఇప్పుడు వచ్చి దర్శించుకున్నారు. చీరలు, రవికెలు వగైరా అమ్మవారికి మొక్కుగా చెల్లించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు.

చిన్నారుల నృత్య అభినయం



చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ గ్రౌండ్‌లో నూకాంబిక అమ్మవారి జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. భాగవతుల శిరీషారాణి శిష్య బృందం, శ్రీ సాయి నాటి భారతీయ అకాడమీ చిన్నారులు 35 మంది పాల్గొని నృత్య ప్రదర్శన చేశారు. వీరికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నూకాంబిక ఉత్సవ కమిటీ చైర్మన్ గొల్లబాబు, సకల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్‌కు ఘన నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయుడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని 80వ వార్డు పరిధి పెద బోయగూడెంలో ఇటీవల హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ మైపాల దీపు దశ దినకర్మ కార్యక్రమం సోమవారం కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కేఎం నాయుడు పరామర్శించారు. దీపు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపు మరణానికి కారణమైన నిందితుడికి వెంటనే కఠిన శిక్ష విధించాలన్నారు. కార్యక్రమంలో మైపాలి నూకరాజు, కొమ్ము పరమేష్, నాగేశ్వరరావు, దొడ్డి సాయి, బోయ గూడెం పెద్దలు పాల్గొన్నారు.

'ఆర్‌ఈసీఎస్‌లో అవినీతిపై పారదర్శక విచారణ'

అనకాపల్లి: ఆర్‌ఈసీఎస్‌లో అవకతవకలపై ఇంకా ఎవరైనా ఫిర్యాదులిస్తే స్వీకరించి పారదర్శకంగా దర్యాప్తు చేపట్టాలని తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. దర్యాప్తు అధికారిగా నియమితులైన సుగర్ ఫ్యాక్టరీ ఎండీ వీవీఎస్ శాస్త్రి పదవీకాలం మూడు నెలలు మాత్రమే ఉందని, కొత్త అధికారిని తక్షణమే నియమించాలని కోరారు. ఏడాదికి రూ.100 కోట్ల పైనే టర్నోవర్ ఉన్న ఆర్‌ఈసీఎస్ సంస్థ ఆడిటర్ రిపోర్ట్స్ గోప్యంగా ఉంచి, అవినీతిని బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విచారణ అధికారిగా ఉన్నత స్థాయి అధికారిని నియమించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అవినీతి అక్రమాలను వెలికితీసి బాధ్యులైన వారిపై చట్టప్రకారం శిక్షించాలని కోరారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	:ట్రైలర్
సత్యనారాయణ స్క్రీన్-1	: రాబిన్‌హుడ్
పర్తిసాయి	: కోర్టు
షిర్డీసాయి	: ఎల్2: ఎంపురాన్ (లూజిఫర్-2)
వెంకటేశ్వర	: షణ్ముఖ
శ్రీసత్య	:సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర	: వీర ధీర శూర


రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 24 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు , బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

దోమ కుడితే..



రోగాల బారిన పట్టణ ప్రజలు

ప్రతి నెలా ఇంటికి అదనపు ఖర్చు

అధ్వానంగా డ్రైనేజీలు

అనకాపల్లి టౌన్: పట్టణంలో చీకటి పడితే దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్న పాటి వీధి కాలువల నుంచి ప్రధాన కాలువలే వీటి ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. వీటి బారి నుంచి ప్రజలు తప్పించుకోవడానికి భారీగానే చేతిచమురు వదిలించుకుంటున్నారు. పట్టణ పరిధిలో లక్షకు పైగా జనాభా నివసిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం 36 వేల గృహాలున్నాయి. రోజూ వేలాది ఇళ్ల నుంచి వస్తున్న వ్యర్థాలు డ్రైనేజీల్లో కలుస్తున్నాయి. ఇవి పారడం లేదు. పట్టణ వ్యాప్తంగా మేజర్ డ్రైనేజీ 16.385 కిలో మీటర్లు, మీడియం డ్రైనేజీ 26.01 కిలో మీటర్లు, మైనరు డ్రైనేజీ 122.683 కిలో మీటర్లు ఉన్నాయి. వీటిని శుభ్రం చేయడానికి సుమారు 25 ఏళ్ల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా 250 మంది పారిశుధ్య సిబ్బంది ఉండేవారు. వీరిలో 150 మంది కార్మికులు రిటైర్ అయ్యారు. అప్పట్లో జనాభా 60 వేల నుంచి 70 వేలు మాత్రమే నివాసం ఉండేవారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా తగినంత పారిశుధ్య సిబ్బంది ఇప్పుడు లేరు. ప్రస్తుతం పర్మినెంట్ 100 మంది, టెంపరరీ సిబ్బంది 70 మంది మాత్రమే విధులను నిర్వహిస్తున్నారు. దీంతో పారిశుధ్య పనులను పూర్తి స్థాయిలో నిర్వహించలేక పోతున్నారు. వీధుల్లో చెత్త తొలగిస్తున్నప్పటికీ మీడియం, మేజర్ డ్రైనేజీ శుభ్రం చేయడం లేదు. కాలువలలో చెత్తా చెదారంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా పేరుకుపోతున్నాయి. దీంతో మురుగు నీరు పారక దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దోమల నియంత్రణకు జీవీఎంసీ సిబ్బంది అరకొర చర్యలే చేపడుతున్నారు. సాయంత్రం అప్పుడప్పుడు, అక్కడక్కడ ఫాగింగ్ చేస్తున్నారు. యాంటీ లార్వా ఆపరేషన్ పనులు చేపట్టడం లేదు. దాంతో దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగీ, మెదడపు వ్యాధి, ఫైలేరియా వంటి వ్యాధులు బారిన పడుతున్నారు.

దోమల నియంత్రణకు చేతి చమురు

దోమల నియంత్రణకు భారీగానే చేతి చమురు వదిలించుకుంటున్నారు. పట్టణంలో నివాసముంటున్న లక్ష మందిని తీసుకుంటే వీరు రోజూ కాయిల్స్, అగరబత్తీలు, లిక్విడ్స్ వంటివి వాడడం ద్వారా దోమల బారి నుంచి ఉపశమనం పొందుతున్నారు. వీరు ఒక్కొక్కరు దోమల నివారణ వస్తువులపై రూ.10 నుంచి రూ.15 వరకు వ్యయం చేస్తున్నారు. ఈ లెక్కన చూస్తే పట్టణంలో నెలకు లక్షల్లో ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఈ విధంగా చూస్తే ఏడాదిలో కోట్లలో బడ్జెట్ అవుతుందని అంచనా వేయవచ్చు. ఇకనైనా కాలువలను శుభ్రం చేసి దోమల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి నెలా దోమల నియంత్రణకు ఖర్చు



నెలకు కిరాణా వస్తువులు కొనుకున్నట్లు ప్రతి నెలా దోమల నియంత్రణకు వందలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. పెరిగిన నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్నాం. కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తే దోమల బారి నుంచి బయటపడవచ్చు.

– ద్రాక్షారపు శ్రీనివాస్, అనకాపల్లి

కరెంట్ బిల్ తడిసిమోపెడు



రేయింబవళ్లు అని లేకుండా దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వాటి బాధ భరించలేక 24 గంటలూ ఫ్యాన్లు వాడుతున్నాం. దీంతో కరెంట్ బిల్ అధికంగా వస్తోంది. దోమలు వల్ల జ్వరాల బారిన పడుతున్నాం.

– పి. అప్పలరాజు, అనకాపల్లి

తుది దశకు పీఎం శ్రీ పనులు



దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపు

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలులో ప్రధాన మంత్రి శ్రీ పథకం కింద రెండో విడతగా వచ్చిన రూ. 5.72 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి. పీఎం శ్రీ పథకంలో పాఠశాల ఎంపికైన నేపథ్యంలో మంజూరైన నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, స్కూలు కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. రూ.2.50 లక్షలతో ఖో-ఖో కోర్టు, రూ.1.10 లక్షలతో కిచెన్ గార్డెన్, రూ.1.10 లక్షలతో దివ్యాంగుల కోసం 3 ర్యాంపులు, రూ.85 వేలతో వర్షపు నీటి ఇంకుడు గొయ్యిలు నిర్మాణం చేపట్టి పనులు తుది దశలో ఉన్నాయన్నారు. ఇదిలా ఉండగా మొదటి విడతలో రూ. 15 లక్షలు రాగా, వాటితో సైన్స్ ల్యాబ్ నిర్మించినట్లు తెలిపారు.

రామాలయ ప్రారంభోత్సవం



రామాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: మండలంలోని ఈదటంలో రామాలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు చిక్కాల రామారావు పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొంతం నరేష్, గోవిందు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గోవిందరావుది విలువలతో కూడిన రాజకీయం



గోవిందరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పింస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లి టౌన్: విలువలతో కూడిన రాజకీయం కొడగంటి గోవిందరావు సొంతమని సీపీఐ జోన్ కార్యదర్శి వైఎస్ భద్రం అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద గోవిందరావు 102వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధునిగా, కమ్యూనిస్టు పార్టీ పోరాట యోధునిగా రైతాంగ సమస్యల పరిష్కారం కోసం, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరు సాగించారన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారని కొనియాడారు. నిరంతరం నిజాయితీ విలువలతో ప్రజా సమస్యలపైనే పోరాటాలు చేసేవారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మాజీ కౌన్సిలర్ తాకాసి వెంకటేశ్వరావు, శ్రీరామదాసు అబ్బులు, నాయుడు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసనగా ర్యాలీ



నెహ్రూచౌక్ జంక్షన్‌లో మానవహారం చేస్తున్న క్రైస్తవ సంఘాల సభ్యులు

అనకాపల్లి టౌన్: క్రైస్తవులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని క్రైస్తవ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వస్తూ పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పదంగా మృతి చెందడంతో దర్యాప్తును పారదర్శకంగా చేపట్టాలని సోమవారం పట్టణంలోని క్రైస్తవ సంఘాలు శాంతి ర్యాలీ, నెహ్రూచౌక్ జంక్షన్‌లో మానవహారం కార్యక్రమాలు చేపట్టాయి. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాల ప్రతినిధి తిమోతి మాట్లాడుతూ ప్రవీణ్ మృతి చెంది వారం రోజులు గడుస్తున్నా నిందితుల వివరాలు పోలీస్ శాఖ స్పష్టం చేయకపోవడం దారుణమన్నారు. కేసును నీరు గార్చే ప్రయత్నం జరుగుతుందని, యావత్ క్రైస్తవ సమాజం ప్రవీణ్ మృతిని హత్యగానే భావిస్తుందన్నారు. దీనిపై సీబీఐతో విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ముధుబాబు, వినోద్ అబ్రహం, సిహెచ్ ప్రకాష్, పాస్టర్లు పాల్గొన్నారు.

పచ్చగడ్డి కోసం అల్లాడుతున్న మూగజీవాలు



తీరంలో గడ్డిపరకలు ఏరుకుంటున్న మేకలు

పరవాడ: ఎండలు మండిపోతున్నాయి. మండలంలో పచ్చిక బయళ్లు ఎండిపోయాయి. దీంతో మూగ జీవాలు పచ్చగడ్డి దొరక్క అల్లాడుతున్నాయి. మండలంలో పెదముషిడివాడ, వాడచీపురుపల్లి దరి గొల్లపేట, వెన్నలపాలెం దరి గొల్లలపాలెం, రావాడ దరి బొట్టవానిపాలెం, నాయుడుపాలెం దరి గొల్లపేట గ్రామాలకు చెందిన రైతులు గొర్రెలు, మేకలను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఎండా కాలం రావడంతో మూగ జీవాల పోషణ వారికి తలకు మించిన భారంగా మారింది. అక్కడక్కడ కొండ బంజర్లలో ఉన్న పశు గ్రాసం కూడా ఎండిపోయింది. మరో దారి లేక సరుగుడు, వేప ఆకుల్ని తినిపించాల్సి వస్తోందని పాడిరైతులు వాపోతున్నారు. స్థానికులు కొండ బంజర్లను ఆక్రమించి జీడి తోటలను సాగు చేయడంతో గొర్రెలు, మేకలకు గ్రాసం కొరత మరింతగా పెరిగింది. పండగలు, పబ్బాలకు ఇళ్ల వద్ద మేపుకుంటున్న గొర్రెలు, మేకల్ని సాకడం కూడా తలకు మించిన భారంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్‌లకు సీసీ కెమెరాలు తప్పనిసరి



కంఫర్ట్‌హోం అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి: ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లోనూ తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలోని కంఫర్ట్ హోమ్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో 150 ఫ్లాట్ల యజమానులు, తమ నివాసాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభించిన సీఐ మాట్లాడుతూ జోన్ పరిధిలో దొంగతనాల నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. వేసవికాలంలో ప్రజలు చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎక్కువ రోజులు బయటకు వెళితే తప్పనిసరిగా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. ప్రతి ప్రాంతంలో రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం అపార్ట్‌మెంట్‌వాసులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న స్విమ్మింగ్ పూల్‌ను సీఐ ప్రారంభించారు. ఎస్ఐ డి.సూరిబాబు, అపార్ట్‌మెంట్ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



కశింకోటలో ఈద్-ఘాహ్ వద్ద సంప్రదాయంగా కానుకలు స్వీకరిస్తున్న ముస్లింలు



శారదానది ఒడ్డున ఈద్ ఘాట్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కశింకోట: మండలంలోని ముస్లింలు అతి పవిత్రంగా భావించే రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కశింకోటలోని శివారులో ఈద్-గాహ్ వద్ద ముస్లింలు సంప్రదాయ వస్త్రాలు ధరించి సామూహిక ప్రార్థనలు చేశారు. కశింకోట, బయ్యవరం తదితర గ్రామాలకు చెందిన ముస్లింలు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూరి మసీదు ఇమాం జియార్ రెహమాన్ అల్లా ప్రవచించిన సూక్తులను చదివి వినిపించారు. అనంతరం ముస్లింల నుంచి సంప్రదాయంగా చందాలను స్వీకరించారు. అనంతరం పెద్దల నుంచి పిల్లల వరకు పరస్పరం సంప్రదాయంగా ఆలింగనం చేసుకొని ఆనందోత్సాహాలతో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మైనార్టీ విభాగం అధ్యక్షుడు బాబర్, నూరి మసీదు ప్రధాన కార్యదర్శి ఎస్ఎం అలీ, మాజీ అధ్యక్షుడు ఐఎం షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక జామియా మసీదు, చింతలపాలెం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమామ్ మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మిఠాయిలు, సేమియా పంచిపెట్టారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎస్.కె, బాబ్జీ (బాబూరావు), కార్యదర్శి ఎండీ రబ్బానిబాయి, ఉపాధ్యక్షుడు కన్నూరుపాలెం రెహమాన్, ప్రతినిధి ఎస్.కె. ఇస్మాయిల్, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.కె. దర్గా సాహెబ్, కమిటీ సభ్యులు షేక్ రెహమాన్, షేక్ అహ్మద్, అబ్దుల్ కబీర్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: పట్టణంలో రంజాన్ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెరుగుబజార్ వద్ద జామీద్ మసీదు, శారదాబ్రిడ్జి వద్ద చిన్న మసీదు, ఈద్ ఘాట్‌ల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. చిన్న, పెద్ద భేదం లేకుండా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు దావూద్ ఆలీ, పీఎస్ హుస్సేన్, ఎండీ జిలానీ మాట్లాడుతూ ఈ పండుగ అనుబంధాలను పెంచుతుందన్నారు. పండుగ రోజైనా నిరుపేదలు కడుపు నిండా తినాలని పవిత్ర గ్రంథం ఖురాన్ సూచిస్తుందన్నారు. తద్వారా మనిషిలోని క్రమశిక్షణ, ఐక్యత, ప్రేమ, దానగుణం తదితర ఎన్నో సుగుణాలను అలవరుచుకునే విధానమే రంజాన్ పండుగ అని తెలిపారు.



వేల్పులవీధి జంక్షన్ వద్ద పాయసం వితరణ చేస్తున్న ముస్లింలు



కశింకోటలో రంజాన్ శుభా కాంక్షలు తెలుపుకుంటున్న ముస్లిం పెద్దలు

'సస్పెన్షన్ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి'



డిపో ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్: స్థానిక డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ ఎంఏ రావు, కండక్టర్ ఎస్ఎస్ నారాయణలను అక్రమంగా సస్పెన్షన్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు ఎస్ రావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 38వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1-2019 సర్క్యులర్‌కి విరుద్ధంగా చేసిన సస్పెన్షన్ చెల్లదన్నారు. ఈ కార్యక్రమంలో పి. సుధాకర్, రాజయ్య, రమేష్, కె.వి.బి. లక్ష్మి, పి.జి. లక్ష్మి, కె. పద్మావతి, కె. లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎగసిపడుతున్న దుమ్మూధూళితో ఇబ్బందులు



ఎన్టీపీసీ వద్ద అలముకున్న దుమ్మూధూళి

పరవాడ: వాడచీపురుపల్లి-పరవాడ రహదారిలో సింహాద్రి ఎన్టీపీసీ వద్ద భారీ వాహనాల రాకపోకలతో దుమ్మూధూళి ఎగసిపడుతోంది. దీంతో సమీప గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎన్టీపీసీ నుంచి బూడిదను ఎగుమతి చేసేందుకు రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు అధిక సంఖ్యలో లారీ యార్డుకు వస్తాయి. యార్డు నుంచి బూడిద లోడింగ్‌కు సమీపంలోని స్టాక్ పాయింట్‌కు రాకపోకలు సాగించే క్రమంలో బూడిద ఎక్కువగా రేగుతోంది. స్థానిక పాన్ షాపులు, టీ దుకాణాలు, భోజన హోటళ్లను ఈ దుమ్మూధూళి కమ్ముకోవడంతో తమ వ్యాపారాలు సన్నగిల్లుతున్నాయని వర్తకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రహదారిలో రాకపోకలు సాగించే తంతడి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి తదితర గ్రామాల ప్రజలు ఈ ధూళిని పీల్చడం వల్ల, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. గతంలో లారీల రాకపోకల సమయంలో ధూళి నియంత్రణకు ఆ ప్రదేశాలను నీటితో తడిపేవారు. ప్రస్తుతం ఆ పద్ధతికి యాజమాన్యం తిలోదకాలిచ్చింది. ఎండాకాలం, విపరీతంగా గాలిలోకి లేస్తున్న దుమ్మూధూళితో నరకయాతన పడుతున్నట్లు ప్రజలు చెప్పున్నారు. ఎన్టీపీసీ మెయిన్ గేట్ పరిసరాల్లో ఎగసిపడుతున్న ధూళి నియంత్రణకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేత్రపర్వంగా భావనారుషి, భద్రావతి కల్యాణం



తోటాడలో భావనారుషి, భద్రావతిల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని తోటాడలో పురాతన శైవక్షేత్రం కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో భద్రావతి సమేత భావనారుషిల కల్యాణం ఆదివారం రాత్రి వేడుకగా నిర్వహించారు. వేద పండితులు రాంప్రసాద్ శర్మ పర్యవేక్షణలో కల్యాణ తంతు జరిగింది. ముందుగా ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించి అనంతరం ప్రత్యేక మండపంలో కల్యాణం జరిపించారు. భక్తుల శివనామస్మరణతో పాటు మంగళవాయిద్యాల నడుమ కన్నుల పండువగా కల్యాణం నిర్వహించారు. ధర్మకర్తలు దొడ్డి సూర్యనారాయణ, త్రినాథ్, సన్యాసిరావు, సత్యనారాయణ, తాతబ్బాయి తదితరులు పాల్గొని పూజలు చేశారు. సమీప గ్రామాలైన నారాయుడుపాలెం, టి.సిరసపల్లి, తోటాడ, గవర్ల అనకాపల్లికి చెందిన భక్తులు కల్యాణం తిలకించేందుకు భారీగా తరలివచ్చారు.